క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా షేక్ కలందర్‌బాషా

గద్వాల: ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా షేక్ కలందర్‌బాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన.. పదోన్నతిపై గద్వాల కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి



మల్దకల్: ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఆయుర్వేద డాక్టర్ జయమ్మ సూచించారు. మండలంలోని సద్దలోనిపల్లి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందన్నారు. వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నల్లన్న, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మహేశ్వరి, రాము పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రక్త పరీక్షలు చేయించుకునే రోగులకు సకాలంలో రిపోర్టులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగులు గంటల తరబడి రిపోర్టుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అంకితభావంతో పనిచేయాలి



అయిజ: పోలీస్ ఉద్యోగాలు సాధించిన వారు అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు సూచించారు. మండల కేంద్రంలోని కొత్తపేటకు చెందిన అన్నదమ్ముళ్లు ముస్తాక్, ఆసీఫ్, మేడికొండ జాన్సన్ పోలీస్ ఉద్యోగాలు సాధించగా, శుక్రవారం వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మధుగౌడ్, రాజు, మండల అధ్యక్షుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



గద్వాల అర్బన్: పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న డీపీఎం, కంప్యూటర్ ఆపరేటర్లకు పేస్కేల్ అమలుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం నాయకులు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె శుక్రవారంతో 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు కల్పించే అన్ని వసతులు కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీపీఎం రమేష్‌బాబు, ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు భార్గవ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, జనరల్ సెక్రటరి రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



గట్టు: మండలంలోని సల్కాపురం–జోకన్‌గట్టు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు వీవీ నర్సింహ అన్నారు. శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్.. రోడ్డుపై గుంతలు తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి పనులను ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరేశం, నర్సింహ, హనుమంతు, మల్లేష్, నర్సమ్మ, ఈరన్న, వీరేష్ పాల్గొన్నారు.

దసరా కానుక బతుకమ్మ చీర



ఉండవెల్లిలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి: ప్రభుత్వం మహిళలకు దసరా కానుకగా బతుకమ్మ చీరలను అందిస్తోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తుందని తెలిపారు. అదేవిధంగా రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖ, ఎంపీపీ భీసమ్మ, వైస్‌ఎంపీపీ దేవన్న, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి, తేజ, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, ఉపసర్పంచ్ సయ్యద్ రెహమాన్, శివారెడ్డి, పాండురంగారావు, ముత్యాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీరాములు, రవి, కొండన్న, నరహరి, సంజన్న పాల్గొన్నారు.

అయిజ: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నదేవన్న, కమిషనర్ గోల్కొండ నర్సయ్య మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఏఈ గోపాల్, మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మహిళలందరికీ బతుకమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు సర్పంచ్ రమేష్ అన్నారు. మండలంలోని కోతులగిద్దలో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు రంగస్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సింహులు, డీలర్ వేమారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని అమరవాయిలో శుక్రవారం ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ పద్మమ్మ మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన మహిళలకు దసరా కానుకగా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెద్దొడ్డిలో ఎంపీటీసీ రాజు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, ఉపసర్పంచ్ సరోజ, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, చిన్నకిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే అబ్రహం సూచించారు. ఇటిక్యాల మండలం ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథంతో కలిసి అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముసాయిదాబేగం, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, ఎంపీడీఓ రాఘవ, ఎంఈఓ రాజు, సర్పంచ్ మధునాయుడు పాల్గొన్నారు. అదేవిధంగా ఎర్రవల్లి మండలంలోని సాసనూలులో ఎంపీపీ స్నేహ బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, మల్లన్న, వీరన్న , రామయ్య, శ్రీధర్, కార్యదర్శి కౌసల్య పాల్గొన్నారు.



ఎర్రవల్లి మండలం సాసనూలులో..



ధరూరు మండలం కోతులగిద్దలో..



అయిజ పట్టణంలో..



మల్దకల్ మండలం అమరవాయిలో..

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

- రూ.5,909 రికవరీకి ఆదేశం



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

శాంతినగర్: ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీకి సంబంధించి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. అడిషనల్ డీఆర్డీఓ నాగేంద్రం, విజిలెన్స్ ఆఫీసర్ శ్రీనివాసులు సమక్షంలో గ్రామాల వారీగా సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించారు. మండలంలోని పది గ్రామపంచాయతీల్లో 2021 జూన్ 1నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి హామీ పథకంలో రూ.3,66,94,199 నిధులతో చేపట్టిన పనులపై గతనెల 25నుంచి ఈనెల 5వ తేదీవరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఇందులో రూ.5,909 నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించి, రికవరీకి ఆదేశించారు ఎంపీపీ రజిత ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావేదికలో ఎంపీడీఓ రవీంద్ర, ఏపీఓ విజయలలిత, అంబుడ్స్‌మెన్ జమ్మన్న, టెక్నికల్ అసిస్టెంట్లు రాఘవేందర్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



స్పోర్ట్స్ కిట్ అందిస్తున్న వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ధరూరు: గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ర్యాలంపాడులో శుక్రవారం క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయడంతోపాటు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యువత సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, నవీన్, తిమ్మప్ప, అంపన్న పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవిందురావు

రాజోళి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరముందని ఎంపీడీఓ గోవిందురావు, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హన్మిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలు, బాలకార్మికులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా ముందుకెళ్లాలని కోరారు. సమావేశంలో ఉపసర్పంచ్ గోపాల్, ఎస్‌ఎంసీ చైర్మన్ సుధాకర్, అబ్దుల్ రహెమాన్, యూసుఫ్‌మియా ఉన్నారు.

పేదలకు వరం.. 'కల్యాణలక్ష్మి'



కేటీదొడ్డిలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు/కేటీదొడ్డి: కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ధరూరు, కేటీదొడ్డి మండల కేంద్రాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఆడబిడ్డ పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు అష్టకష్టాలు పడేవారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకంతో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్షా 116 అందించి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి దేశంలో ఎక్కడాలేని పథకాలను అమలు చేయడంతోపాటు గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దని కోరారు. అనంతరం యువకులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

గద్వాల రూరల్: గట్టు, మల్దకల్, కేటీ దొడ్డి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జెడ్పీటీసీలు పద్మ, రాజశేఖర్, ఎంపీపీ మనోరమ, వైస్‌ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణ నాయుడు, సర్పంచ్ పద్మమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, డీఆర్ విజయ్‌కుమార్, రఘువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శివలీల, పురుషోత్తంరెడ్డి, వెంకట్రాములు, శ్రీనివాస్‌రెడ్డి, సర్వారెడ్డి, హన్మంతు, ఉరుకుందు, చక్రధర్, గోవిందు, నసీర్, యుగంధర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురుకులంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం విద్యార్థులను అభినందించారు. అండర్–17, 19 విభాగాల్లో నిర్వహించిన వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో మానస, భార్గవి, మల్లీశ్వరి, మానస, అనిత, పూజిత, నందిని, నౌరానా, రూపారాణి, భవాని, కవిత ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

తైక్వాండో పోటీల్లో సిల్వర్ పతకం..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటీవల నిర్వహించిన సబ్ జూనియర్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక సరస్వతి పాఠశాల విద్యార్థి సందీప్ ప్రతిభ కనబర్చి సిల్వర్ పతకం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో మధులికారెడ్డి, నందిని, వెంకటేశ్వరావు, సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఉండవెల్లి: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకట్రావును శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు రేఖ, లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ భీసమ్మ, వైస్‌ఎంపీపీ దేవన్న, నాయకులు వెంకటేశ్వర్లుగౌడ్, సయ్యద్ రెహమాన్, నర్సింహ, కొండన్న, బల్వీర్‌సింగ్, రాజు, దామోదర్‌గౌడ్, రఘురెడ్డి పాల్గొన్నారు.

వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు



ఉండవెల్లి: వర్షాల కోసం స్థానిక మౌలాలి స్వామి దర్గాలో రైతులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వర్షాలు కురువకపోవడంతో పంటలు ఎండుతున్నాయని, వరుణుడు కరుణించాలని కాంక్షిస్తూ ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రమణ, ఖాదర్, నర్సింహ, సుంకన్న, కొండన్న, కృష్ణ, వెంకటేశ్వర్లుగౌడ్, సర్పంచ్ రేఖ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

పెబ్బేరు రూరల్: మండలంలోని వల్లభ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్ వద్ద మోటార్ సైకిల్, లారీని ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. పెబ్బేరు పట్టణానికి చెందిన ఖాజ వనపర్తి నుంచి పెబ్బేరుకు వెళ్తుండగా వల్లభ్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద పెబ్బేరు నుంచి వస్తున్న లారీని ఢీకొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలపారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెబ్బేరు ఏఎస్‌ఐ జయరాంలు తెలిపారు.

సకల సదుపాయాలతో సర్కారు విద్య



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి విద్య అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. మున్సిపాలిటీలోని హరిజనవాడ జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో శుక్రవారం అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేదలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంతో పాటు ఉదయం అల్పాహారం, సన్నబియ్యంతో మధ్యాహ్నభోజనం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఎంఈఓ అశోక్‌కుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, హెచ్‌ఎం నాగరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ మద్దిలేటి, ఉపాధ్యాయులు మాబుసాబ్, శ్రీధర్, భైరోజు రాజశేఖర్, రాజశేఖర్, పీఈటీ శైలజ పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరాలయ అశ్వం మృతి



అశ్వం అంత్యక్రియల్లో పాల్గొన్న భక్తులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అశ్వం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. స్వామివారి బ్రహ్మోత్సవాలు, ఊరేగింపులకు వినియోగించే అశ్వం మృతి చెందిందన్న విషయం తెలుసుకున్న భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయబద్ధంగా అశ్వానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆశావర్కర్ల ఆందోళన ఉధృతం



మల్దకల్‌లో..



అలంపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాలు

అలంపూర్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశావర్కర్లు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆశావర్కర్ల రాస్తారోకోతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆశావర్కర్లను స్టేషన్‌కు తరలించారు. ఆశాలకు బీఎస్పీ నాయకుడు మహేష్, కేవీపీఎస్ నాయకుడు అయ్యప్ప మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ ఆశావర్కర్లు 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరమ్మ, ప్రమీల, పద్మ, నాగలక్ష్మమ్మ, విజయమ్మ, చంద్రకళ, ఇమాంబీ, చిట్టెమ్మ, ఆంజనమ్మ, కృష్ణవేణి. శ్రీదేవి పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని గద్వాల–అయిజ ప్రధాన రహదారిపై ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరస్వతి, కాంతమ్మ, సుజాత, నర్సమ్మ, శంకరమ్మ, భారతమ్మ, కేశమ్మ, కృష్ణావేణి, సుజాత పాల్గొన్నారు.

ధరూరు: ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాయచూరు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేదాక పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కరుణ, లక్ష్మీదేవి, లలిత పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఏఓ హనుమంతురెడ్డి

గట్టు: పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి హనుమంతురెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన వ్యవసాయ విధానంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ, పీఎస్‌బీ, వేపపిండి, వేపనూనె ఇతర ఆర్గానిక్ ఉత్పత్తుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయంపై రైతుల ధర్నా



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

అయిజ: మండలంలోని తుపత్రాల గ్రామ రైతులు శుక్రవారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పంటలు ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. అధికార పార్టీ నాయకులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలపై ఉన్న ధ్యాస రైతులపై లేదని మండిపడ్డారు. అయితే ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్.. ఏడీఈ గోవింద్‌తో ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ సరఫరాను మెరుగు పరుస్తామని ఏడీఈ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో బాబూరావు, మైనర్‌బాబు, హనుమన్న, పాండురంగ, దేవేంద్ర, రవీంద్ర, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న సరిత

కేటీదొడ్డి/ధరూరు: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలంలోని నందిన్నె, కేటీదొడ్డి గ్రామాల్లో శుక్రవారం తిరగబడుదాం.. తరమికొడదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని కోరారు. అదేవిధంగా ధరూరులోని ఆద్య కేశవాచార్యులు గృహంలో ఉడిపి పీఠాధిపతి విద్యాదేశీశు తీర్థస్వామిని జెడ్పీ చైర్‌పర్సన్ కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడిన దేవార్జున్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ గీత, సింగిల్‌విండో డైరెక్టర్ సురేష్, శేషాద్రి, శ్రీను, రామన్‌గౌడు, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రాఘవేంద్రారెడ్డి, నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ కర్రెన్న, ఉపసర్పంచ్ నవారన్న పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందని, రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. మండలంలోని భీమవరంలో 'తిరగబడుదాం.. తరమికొడుదాం' కార్యక్రమం నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా ఉత్తనూర్ ఇందిరమ్మ కాలనీలో పారిశుద్ధ్య పనులను మండల అధ్యక్షుడు జయన్న పరిశీలించారు. బసవరాజ్, మధుకుమార్, కృష్ణ, రమేష్, లింగన్న, రవిబాబు, యేసన్న, రమేష్, శేషు, గోకారి, చిన్నరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాలలో కాంగ్రెస్ నాయకులు తిరగబడుతాం.. తరిమికొడదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. భాస్కర్, ప్రభాకర్, సంపత్, శేఖర్ పాల్గొన్నారు.